మంత్రి కోమటిరెడ్డికి హై కోర్టులో ఊరట

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): రెండు వేర్వేరు కేసుల్లో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ప్రోటోకాల్ ఉల్లంఘన కేసులో రూ.4,200 జరిమానా విధిస్తూ 2021లో ఎమ్మెల్యేలు, ఎంపీల కేసుల విచారణ ప్రత్యేక కోర్టు తీర్పును హైకోర్టు రద్దు చేసింది. నల్లగొండ ఆర్డీవో కార్యాలయ భవనాన్ని ఆనాటి మంత్రి జగదీశ్ రెడ్డి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో దానిని కోమటిరెడ్డి ప్రారంభించారు. ఆర్డీవో ఫిర్యాదుతో 2015లో నల్లగొండ టూ టౌన్‌లో నమోదైన కేసులో ప్రత్యేక కోర్టు విధించిన శిక్షను హైకోర్టు జస్టిస్ కే లక్ష్మణ్ రద్దు చేస్తూ తీర్పు వెలువరించారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో కూడా..

నల్లగొండ జిల్లా కనగల్ పోలీస్ స్టేషన్‌లో 2014లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసును హైకోర్టు రద్దు చేసింది. మండల సర్వసభ్య సమావేశంలో కోమటిరెడ్డి తనను కులం పేరుతో దూషించారంటూ నాటి కనగల్ ఎంపీపీ కృష్ణయ్య ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదు చేశారు. ఆ ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోమటిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం తీర్పు చెప్పారు.

గ్రేడ్-1 ఉద్యోగోన్నతులు గ్రేడ్-2 పండితులకే

- హైకోర్టు కీలక తీర్పు
- ఉపాధ్యాయ సంఘాల హర్షం
- 10,454 మంది భాషాపండితులకు గ్రేడ్ -1 పదోన్నతులు
- తక్షణమే పదోన్నతులు కల్పించాలని నేతల డిమాండ్

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): భాషాపండితుల 30 ఏండ్ల ఎదురుచూపులకు తెరదించుతూ హైకోర్టు శుక్రవారం కీలక తీర్పు ఇచ్చింది. గ్రేడ్ -1 భాషాపండితుల పదోన్నతులను గ్రేడ్ -2 భాషాపండితులకే కేటాయించాలని తీర్పును వెలువరించింది. దీంతో గ్రేడ్ -1 పోస్టులు ఇక నుంచి భాషాశిక్షణ పూర్తిచేసిన గ్రేడ్ -2 భాషాపండితులకే దక్కుతాయి. ఈ తీర్పును అమలుచేస్తే రాష్ట్రంలోని 10,454 భాషాపండితులకు గ్రేడ్ -1 పదోన్నతులు దక్కుతాయి. ఈ తీర్పు పట్ల ఉపాధ్యాయ పండిత పరిషత్తు సహా పలు సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి. ప్రభుత్వం, విద్యాశాఖ చొరవ తీసుకొని తక్షణమే గ్రేడ్ -1 పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశాయి. వివరాల్లోకెళ్తే.. ప్రభుత్వ పాఠశాలల తోపాటు, స్థానిక సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న మండల పరిషత్తు, జిల్లా పరిషత్తు పాఠశాల్లో గ్రేడ్ -2 భాషాపండితులు పనిచేస్తున్నారు. వీరంతా తెలుగు, హిందీ, ఉర్దూ భాషల్లో విద్వాన్, విశారద, భూషణ్, ప్రవీణ, బ్యాచిలర్ ఆఫ్ ఓరియంటల్ తెలుగు వంటి కోర్సులు, హెచ్‌పీటీ, టీపీటీ కోర్సులు పూర్తి చేసి గ్రేడ్ -2 భాషాపండితులుగా నియమితులయ్యారు. వీరు స్కూల్ అసిస్టెంట్ హోదా లేకుండానే ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. కానీ గ్రేడ్ -1 భాషాపండితులుగా పదోన్నతి పొందే క్రమంలో వీరికి సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ) పోటీగా వస్తున్నారు. బీఈడీలో తెలుగును ఒక మెథడ్‌గా చదివి, ఎంఏ తెలుగు పూర్తిచేసిన ఎస్జీటీలు గ్రేడ్ - 1పదోన్నతులు పొందుతున్నారు. దీంతో తమకు పదోన్నతులు లభించడం లేదని, 90శాతం పదోన్నతులను ఎస్జీజీలే దక్కించుకొంటున్నారని భాషాపండితులు పేర్కొంటున్నారు. గ్రేడ్ -1 పదోన్నతులు తమకే కల్పించాలని కోరుతున్నారు.

న్యాయం చేసిన కేసీఆర్

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా భాషాపండితులను అప్‌గ్రేడ్‌చేస్తామని అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, 2017, 2019 రెండు విడతల్లో మొత్తం 8,630 మంది పండిట్లను అప్‌గ్రేడ్ చేసి స్కూల్ అసిస్టెంట్ హోదా కల్పించారు. 2017లో జీవో -17, 18ల ద్వారా 2,487 మంది గ్రేడ్ -2 భాషాపండితులను అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వం, తర్వాత, 2019లో జీవో -15 ద్వారా 6,143 మంది పండిట్లను అప్‌గ్రేడ్ చేసింది. పండిట్లను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయడం నిబంధనలకు విరుద్ధమని అభ్యంతరం వ్యక్తంచేస్తూ సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ) కోర్టునాశ్రయించారు. ఆ తర్వాత కేసీఆర్ ప్రభుత్వం పాత జీవోలను సవరించి, ప్రత్యేకంగా జీవోలు జారీ చేసింది. ఈ జీవోలను వ్యతిరేకిస్తూ మళ్లీ ఎస్జీటీలు కోర్టును ఆశ్రయించడంతో భాషాపండితులతో పాటు, ఎస్జీజీలకు పదోన్నతులు కల్పించాలని హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పునిచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ భాషాపండితులు హైకోర్టు డివిజన్ బెంచ్‌కెళ్లగా, సింగిల్ బెంచ్ తీర్పును కొట్టివేస్తూ భాషాపండితులకే పదోన్నతులు కల్పించాలని డివిజన్ బెంచ్ శుక్రవారం కీలక తీర్పునిచ్చింది.

భాషాపండితులకు న్యాయం జరిగింది

అన్ని రకాల అర్హతలున్నా మేం ఎన్నో ఏండ్లుగా పదోన్నతులకు నోచుకోలేకపోయాం. మా కండ్ల ముందే ఇతరులు పదోన్నతులు పొందుతున్నా.. మాలో చాలామంది అన్యాయానికి గురయ్యారు. గ్రేడ్ -2 భాషాపండితులుగానే ఉద్యోగంలోకి వచ్చి, అదే పోస్టుల్లో రిటైర్మెంట్ అయినవాళ్లు ఎంతోమంది ఉన్నారు. తక్కువ హోదాలో, తక్కువ జీతానికి వెట్టిచాకిరి గురయ్యాం. ఈ కేసులో డివిజన్ బెంచ్‌లో ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన న్యాయవాదులకు ధన్యవాదాలు. విద్యాశాఖ ఈ తీర్పును అమలుచేసి, వెంటనే భాషాపండితులకు గ్రేడ్ -1 పదోన్నతులు కల్పించాలి.

– గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ, ఆర్‌యూపీపీ, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

త్వరగా పదోన్నతులు కల్పించాలి

అపార బోధనానుభవం ఉన్న గ్రేడ్ -2 భాషాపండితులకు పదోన్నతులు దక్కలేదు. భాషాపండితులు కాని వారు కూడా పాఠాలు బోధించడంతో విద్యార్థులు నష్టపోయిన సందర్భాలున్నాయి. కొంతమంది మాకు న్యాయంగా దక్కాల్సిన వాటిని అడ్డుకొన్నారు. మేం కోర్టునాశ్రయించడంతో మాకిప్పుడు న్యాయం జరిగింది. ఎట్టకేలకు హైకోర్టు చరిత్రాత్మక తీర్పునివ్వడం శుభసూచకం. విద్యాశాఖ వీలైనంత త్వరగా పదోన్నతులు కల్పించాలి.

– సీ జగదీశ్, ఆర్‌యూపీపీ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

విద్యా - ఉద్యోగ సమాచారం

● ఎస్సీఈఆర్టీలో మళ్లీ డిప్యూటేషన్లు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : పాఠశాల విద్యలో అత్యంత కీలకమైన రాష్ట్ర విద్యా శిక్షణ, పరిశోధన మండలి (ఎస్సీఈఆర్టీ)ని మళ్లీ డిప్యూటేషన్లతో నింపుతున్నారు. ఆన్‌డ్యూటీ పేరిట పాఠశాలల్లో పనిచేయాల్సిన 28 మంది టీచర్లను ఎస్సీఈఆర్టీకి బదిలీ చేశారు. ఇటీవలే ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు. వీరిలో హైదరాబాద్ జిల్లాకు చెందిన ఐదుగురు టీచర్లున్నారు. వీరిని రెండేండ్ల కాలానికి డిప్యూటేషన్‌పై ఎస్సీఈఆర్టీకి బదిలీ చేస్తూ జిల్లా డీఈవో రోహిణి ఉత్తర్వులిచ్చారు.

● రేపు ఏఐఎస్టీఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశం

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : ఆల్ ఇండియా సెకండరీ టీచర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్టీఎఫ్) జాతీయ కార్యవర్గ సమావేశం ఈ నెల 17న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐఎస్టీఎఫ్ జాతీయ అధ్యక్షుడు ఇంద్రశేఖర్ మిశ్రా, ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నర్సింహారెడ్డి సహా పలు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు, ఇన్‌కమ్‌టాక్స్ తదితర అంశాలపై చర్చిస్తామని ఆయన తెలిపారు.

● టీఎస్ఆర్జేసీ దరఖాస్తుల గడువు 31కి పెంపు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : 2024 -25 విద్యాసంవత్సరంలో 35 గురుకుల జూనియర్ కాలేజీల్లో ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్టు తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ (టీఎస్ఆర్జేసీ) కార్యదర్శి సీహెచ్ రమణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు https://tsrjdc.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు 60వేలకు పైగా దరఖాస్తులొచ్చాయని పేర్కొన్నారు.

● పాలిటెక్నిక్‌కు సీ-24 పేరుతో కొత్త కరికులం

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): కోర్సు పూర్తి చేశాక స్థిరపడొచ్చన్న భరోసా దొరికేలా పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల కరికులాన్ని సాంకేతిక విద్యామండలి అధికారులు సిద్ధం చేస్తున్నారు. సీ-24 పేరుతో 'అవుట్ కమ్ బేస్డ్ కరికులమే లక్ష్యంగా విద్యార్థులకు పరిశ్రమల్లో ఆరు మాసాల శిక్షణను తప్పనిసరిగా అమలుచేస్తారు. యాడ్ ఆన్ కోర్సును, మైనర్ కోర్సులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మేజర్ కోర్సుల్లోని ఈసీ విద్యార్థులు ఎలక్ట్రానిక్స్‌ను మేజర్‌గా, సీఎస్ఈ కోర్సులోని ఏఐని మైనర్ ప్రోగ్రాంగా తీసుకోవచ్చు. విద్యార్థులు ఎన్పీటీఎల్, స్వయం పోర్టర్లలోని కోర్సులను ఎంపిక చేసుకోవచ్చు. తాము సంపాధించిన క్రెడిట్లను బదిలీ చేసుకోవచ్చు. ఈవీ పరిశ్రమకు డిమాండ్ పెరుగుతుండటంతో ఎలక్ట్రిక్ వాహనాలు, చార్జింగ్ బ్యాటరీలు సబ్జెక్టులను మైనర్‌గా చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. తొలుత మనదేశంలోని ఇతర రాష్ట్రాల కరికులాన్ని అధ్యయనం చేశారు. ప్రస్తుతం పపంచంలోని ప్రముఖ దేశాల్లోని కరికులాన్ని అధ్యయనం చేస్తున్నారు.

● ఉద్యోగ వినతుల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు, ఆయా సంఘాల ప్రతినిధుల వినతులను పరిశీలించి, పరిష్కరించేందుకు ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించింది. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి నేతృత్వంలో రిటైర్డ్ ప్రొఫెసర్ కోదండరామ్, ఐఏఎస్ అధికారి దివ్యలను సభ్యులుగా నియమించింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఆమోదం తెలిపారు. ఈ నెల 10న ముఖ్యమంత్రి నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పలు వినతులను అందజేశాయి. వాటిని పరిశీలించి సాధ్యాసాధ్యాలు, పరిష్కార మార్గాలను సూచించే బాధ్యతను త్రిసభ్య కమిటీకి అప్పగించారు.

● టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాల్లో మాజీ సైనికులకు అన్యాయం

నేడు ఇందిరా పార్కు వద్ద ధర్నా చేయనున్న మాజీ సైనికులు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేస్తున్న గ్రూప్-3, గ్రూప్-4 క్యాటగిరీ ఉద్యోగాల్లో తమకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని మాజీ సైనికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దేశ రక్షణ కోసం సుమారు 20 ఏండ్ల పాటు సేవలు చేసి ఉద్యోగ విరమణ పొందిన మాజీ సైనికులకు రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. రోస్టర్ పాయింట్ 13, 37 ప్రకారం గ్రూప్ ఉద్యోగాల్లో ముఖ్యంగా గ్రూప్-సీ, డీ క్యాటగిరీ పోస్టుల్లో రిజర్వేషన్లు 2 శాతమే అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కానీ పొరుగున ఉన్న కర్ణాటకతోపాటు రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో గ్రూప్ ఉద్యోగాల్లో 10 నుంచి 12 శాతం వరకు అవకాశం కల్పిస్తున్నారని చెబుతున్నారు. ఉమ్మడి ఏపీలో గ్రూప్-సీ, డీలో 2 శాతం పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీతోపాటు పీహెచ్‌సీలతో సమానంగా మాజీ సైనికులకు 30 శాతం మార్కులకు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హత ఉండేదని చెబుతున్నారు. ఈ అర్హత మార్కుల శాతాన్ని కూడా 40 శాతం నుంచి 30 శాతానికి తగ్గించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు శనివారం ఇందిరా పార్కు వద్ద ధర్నా చేయాలని నిర్ణయించుకున్నామని మాజీ సైనికులు తెలిపారు.

● ఇన్ సర్వీస్ ఉద్యోగులకు ఉన్నతోద్యోగాలు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల ద్వారా బదిలీ వర్కర్లుగా, జనరల్ మజ్దూర్లుగా భూగర్భగనుల్లో పనిచేస్తున్న విద్యావంతులైన యువ కార్మికులకు ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందేందుకు సింగరేణి సంస్థ గొప్ప సువర్ణావకాశాన్ని కల్పిస్తున్నది. వివిధ విభాగాల్లో ఏర్పడిన 986 ఖాళీల భర్తీ కోసం సంస్థలో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ ఉద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ రెండు ఇంటర్నల్ నోటిఫికేషన్లను జారీ చేసింది. ఈ పోస్టుల్లో 204 అధికార హోదా పోస్టులు కాగా, 782 టెక్నిషియన్. కార్మిక స్థాయి పోస్టులు ఉన్నాయి. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం పొందిన సుమారు 16 వేల మంది భూగర్భగనుల్లో బదిలీ వర్కర్లుగా, జనరల్ మజ్దూర్లుగా పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ చేసినవారు, పాలిటెక్నిక్, ఐటీఐ వంటి అర్హతలున్నవారు ఉన్నారు. తాజా నోటిఫికేషన్ ద్వారా వారి అర్హతల ఆధారంగా ఉన్నతోద్యోగాలు కల్పించనున్నారు.

● 22 నుంచి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఇతర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 22 నుంచి సమ్మె చేస్తామని నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు స్పష్టంచేశారు. ఈ మేరకు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ నేతృత్వంలోని బృందం శుక్రవారం కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. మూడు నెలలుగా వేతనాలు అందక పస్తులు ఉంటున్నామని వారు ఈ సందర్భంగా చెప్పారు. విపత్కర పరిస్థితుల్లోనూ విధులు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న ఉద్యోగులకు డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల వేతనాలు అందలేదని తెలిపారు. ఇకపై ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మ, జయమ్మ, సునీత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్ ఎమ్మెల్యే పల్లా!

- అన్ని రకాలుగా దెబ్బ తీసేందుకు రేవంత్ సర్కార్ ప్రయత్నాలు
- తమ్ముడు పల్లా కృష్ణ సంస్థలో కమర్షియల్ ట్యాక్స్ అధికారుల తనిఖీలు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని రేవంత్‌రెడ్డి సర్కార్ టార్గెట్ చేసిందా? కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదాలను ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ ఎండగడుతుండమే ఇందుకు కారణమా? వరుసగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఇలాంటి అనుమానాలే కలుగుతున్నాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కొరకరాని కొయ్యగా మారిన పల్లా రాజేశ్వర్‌రెడ్డిని దెబ్బతీసేందుకు పలు విధాలుగా ప్రయత్నిస్తున్నదనే విమర్శలు ఇప్పటికే ఉన్నాయి. పల్లాతోపాటు ఆయన కుటుంబసభ్యులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలు, వ్యాపారాలను దెబ్బతీయాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ సర్కార్ వివిధ శాఖలను ప్రయోగిస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఏమీ లేకపోయినా, ఏమీ దొరక్కపోయినా దాడుల మీద దాడులు కొనసాగుతుండటం గమనార్హం. తాజాగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోదరుడు పల్లా కృష్ణకు చెందిన ఉప్పల్‌లోని రీడర్స్‌స్టోర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో గురువారం రాత్రి నుంచి కమర్షియల్ ట్యాక్స్ అధికారులు తనిఖీలు చేశారు. సీఎం రేవంత్ ఆదేశాల మేరకే తనిఖీలు చేస్తున్నట్టు కమర్షియల్ ట్యాక్స్ అధికారులు ప్రకటించారు. రెండు రోజులపాటు సోదాలు, తనిఖీలు చేసిన అధికారులు ఏమీ తేల్చలేకపోయారు. పల్లాను ఇబ్బంది పెట్టడం ఇదేమీ కొత్తకాదు. తొలుత పల్లాకు చెందిన విద్యాసంస్థలపై ప్రభుత్వం గురిపెట్టింది. ఉన్నతాధికారులను సమీక్షకు పిలిచి ప్రైవేట్‌వర్సిటీల్లో రిజర్వేషన్లు ఎందుకు అమలుచేయడం లేదని ప్రశ్నించింది. దేశంలో ఒక్క ఉత్తరప్రదేశ్‌లో తప్ప ఎక్కడా రిజర్వేషన్లు అమలుచేయడం లేదని, అక్కడ ప్రత్యేకంగా చట్టం చేశారన్న విషయాన్ని తెలుసుకొని ఈ విషయంలో పల్లాను ఏమీ చేయలేకపోయింది. ఆ తర్వాత భూకబ్జాలంటూ తమ పార్టీకి చెందిన తీన్మార్ మల్లన్నతో ఫిర్యాదు చేయించారు. గత నాలుగేండ్లుగా తీన్మార్ మల్లన్న ఇవే ఆరోపణలు చేయడం తప్ప ఒక్కటి కూడా నిరూపించలేకపోయారు. ఆ తర్వాత కుటుంబసభ్యులను లాగారు. విద్యుత్తు సంస్థల్లో అక్రమ నియామకాలంటూ తప్పుడు ప్రచారం చేశారు. తీరా వాస్తవాలు వెల్లడించాక నాలుక్కరుచుకున్నారు. ఇప్పుడు తాజాగా పల్లా కృష్ణకు చెందిన రీడర్స్‌స్టోర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌పై కమర్షియల్ ట్యాక్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో కూడా ఏమీ తేల్చలేకపోవడం గమనార్హం.

వెయిటింగ్ జాబితా లేదు

- అభ్యర్థులు జాయిన్‌కాని ఖాళీలను క్యారీఫార్వర్డ్ చేస్తం
- తరువాతి వచ్చే నోటిఫికేషన్‌లో నింపుతాం
- రూ.200 పే చేస్తే అర్హులకు మార్కుల మెమో
- పారదర్శకత పాటిస్తూ పోస్టులను భర్తీ చేశాం
- ట్రిబ్ ఛైర్మన్ ఆయేషా మస్రత్ ఖానం వెల్లడి

హైదరాబాద్, మార్చి15 (నమస్తే తెలంగాణ): గురుకుల నియామకాల్లో వెయిటింగ్ లిస్టు విధానం లేదని తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) ఛైర్మన్ ఆయేషా మస్రత్ ఖానం శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. భర్తీ కాని, అభ్యర్థులు జాయిన్ కాకపోవడం వల్ల ఏర్పడే ఖాళీలను క్యారీఫార్వర్డ్ చేసి రాబోయే నోటిఫికేషన్ ద్వారా నింపుతామని తేల్చిచెప్పారు. గురుకుల పోస్టుల భర్తీ విధానంపై ఆరోపణలు వెల్లువెత్తున్న నేపథ్యంలో ట్రిబ్ ఛైర్మన్ స్పందించారు. ఆరోపణలను ఆ ప్రకటనలో కొట్టిపడేశారు. గురుకుల బోర్డు ద్వారా చేపట్టిన నియామకాలు 100శాతం పారదర్శకంగా, నిబద్ధతతో కొనసాగాయని తెలిపారు. వివిధ మాధ్యమాల్లో వస్తున్న వార్తలు అభ్యర్థులను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని పేర్కొన్నారు. అవకతవకలకు తావు లేకుండా డీఎల్, జేఎల్ ఫలితాలను ఇచ్చామని స్పష్టంచేశారు. డీఎల్, జేఎల్ 1:2 లిస్టును ఫిబ్రవరి 15,16వ తేదీల్లో ప్రకటించామని, డెమోలను ఫిబ్రవరి19 నుంచి 22వరకు నిర్వహించామని వివరించారు. ఫిబ్రవరి 28న డీఎల్, 29న జేఎల్ ఫలితాలను వెల్లడించామని చెప్పారు. అనుమానాలకు తావివ్వకుండానే మార్చి 4న అభ్యర్థులకు నియామక పత్రాలను అందించామని పేర్కొన్నారు. నిబంధనల మేరకు అన్ని రిజర్వేషన్లు పాటిస్తూ, మధ్యవర్తులను పైరవీకారులకు అవకాశం ఇవ్వకుండా, పారదర్శకంగా, అభ్యర్థులకు ఏవిధమైన ఇబ్బంది కలగకుండా నియామకాల ప్రక్రియ మొదలు పెట్టి అతి తక్కువ కాలంలోనే ఫలితాలను ప్రకటించామని వెల్లడించారు.

అర్హులైన అభ్యర్థులకు మార్కుల మెమో

నోటిఫికేషన్‌లోని పేరా 11 (ఏ) ప్రకారం మార్కుల మెమోలను నెల రోజుల తర్వాత నుంచి 90 రోజుల వరకు ట్రిబ్ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని స్పష్టంచేశారు. ఆన్‌లైన్ రూ.200 పే చేస్తే, అదీ అర్హులైన అభ్యర్థులకు మాత్రమే మార్కుల మెమో అందజేస్తామని తెలిపారు. డెమో నిబంధనలను పాటించామని, అభ్యర్థులకు వైట్ బోర్డులు, మార్కర్ పెన్నులు, డెమోకు అవసరమైన వాటిని ప్రతి బోర్డులో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఏ బోర్డులో ఎవరు ఉంటారనే విషయాన్ని, ఏ అభ్యర్థులు ఏ బోర్డుకు వెళ్తారనే అంశాన్ని చివరి నిమిషంలోనే నిర్ణయించడంతో పాటు, అభ్యర్థుల వ్యక్తిగత వివరాలను తెలపకుండా కేవలం హాల్‌టికెట్ల నంబర్లను మాత్రమే బోర్డుకు అందించామని వివరించారు.

37 వేల కోట్లకు చేరువలో సింగరేణి టర్నోవర్

- గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 12 శాతం వృద్ధి
- ఇకపై రోజుకు 2 లక్షల 45 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా
- సీఎండీ బలరాం వెల్లడి

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో తన చరిత్రలోనే అత్యధికంగా రూ.37 వేల కోట్ల టర్నోవర్‌కు చేరువకు చేరినట్టు ఆ సంస్థ సీఎండీ బలరాం తెలిపారు. నిరుటితో పోల్చితే ఇది 12 శాతం అధికమని ఆయన పేర్కొన్నారు. దీంట్లో బొగ్గు విక్రయాల ద్వారా రూ.32,500 కోట్లు, థర్మల్ విద్యుత్తు విక్రయం ద్వారా రూ.4,500 కోట్ల టర్నోవర్‌ను సాధించనున్నదని తెలిపారు. దేశంలో నవరత్న కంపెనీల కన్నా సింగరేణి అద్భుత పనితీరు కనబరుస్తున్నదని పేర్కొన్నారు. గతేడాది రూ.33 వేల కోట్ల టర్నోవర్‌ను సాధించగా, ఈ ఏడాది ఫిబ్రవరికే రూ.33 వేల కోట్ల టర్నోవర్‌ను సింగరేణి అధిగమించిందని తెలిపారు. ఈ మాసాంతానికి 700 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయనున్నామని వెల్లడించారు. ఇకపై రోజుకు 2.45 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయడం ద్వారా వార్షిక లక్ష్యాన్ని చేరుకోబోతున్నాని తెలిపారు.

కులగణనకు సర్వేకు 150 కోట్లు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కులగణన (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ రంగాలు) నిర్వహణకు రూ.150 కోట్లను మంజూరు చేస్తూ, శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కులగణన సర్వే కోసం రూ.150 కోట్ల అంచనాతో రాష్ట్ర బీసీ కమిషన్ చేసిన ప్రతిపాదనలను మంత్రిమండలి ఆమోదం మేరకు ప్రభుత్వ బడ్జెట్‌లో పొందుపర్చి, తాజాగా నిధులను విడుదల చేసింది. అయితే సర్వేను ఏ పద్ధతిలో, ఏవిధంగా నిర్వహించాలనే మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేయలేదు. వాటిని తర్వాత ప్రత్యేకంగా విడుదల చేస్తామని ప్రకటించడం గమనార్హం. మార్గదర్శకాలు లేకుండా సర్వే ఎలా ముందుకు సాగుతుందని బీసీ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. నెలరోజులు కాలయాపన చేసి, ఇప్పుడు నిధులను మంజూరు చేయడం ఎన్నికల జిమ్మిక్కేనని బీసీ నేతలు మండిపడుతున్నారు.

ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఉండాలి

ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు వెంకటేశం

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని, మాల, మాదిగ కార్పొరేషన్లలో తమను కలిపితే ఊరుకోబోమని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వెంకటేశం మాట్లాడుతూ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటుపై కాంగ్రెస్ స్పష్టత నివ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల క్యాబినెట్ సమావేశంలో మాల, మాల ఉపకులాలకు ఒక కార్పొరేషన్, మాదిగ, మాదిగ ఉపకులాలకు మరో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంలో స్పష్టత లేదని విమర్శించారు. గత ఉమ్మడి ఎస్సీ కార్పొరేషన్ వల్ల మాల, మాదిగకులాలే పూర్తిగా లబ్ధి పొందాయని, ఇతర వెనకబడిన 57 ఉపకులాలు తీవ్రంగా నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక పోరాటాల ఫలితంగా కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో ప్రకటించి, మళ్లీ మాల మాదిగల కిందే మిగతా 57 ఉపకులాలను పెట్టడం దారుణమని ధ్వజమెత్తార